



కలశజ్యోతి ఊరేగింపులో అమ్మవారి దీక్షాదారులు

కనులపండువగా కలశ జ్యోతి ఊరేగింపు

విజయనగరం రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ దీక్షదారులు ఆదివారం రాత్రి కలశ జ్యోతి ఊరేగింపు నిర్వహించారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని వనంగుడి నుంచి ఈ తంతు చేపట్టారు. ఊరేగింపు ఎన్‌సీఎస్ రోడ్, కన్యకాపరమేశ్వరి ఆలయం మీదుగా గంటస్తంబం వరకు సాగింది. అనంతరం మూడులాంతర్ల వద్ద నున్న చదురుగుడిలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈ ప్రక్రియ ఆసాంతం పైడిమాంబ నినాదాలతో విజయనగర వీధులు హోరెత్తిపోయాయి. కార్యక్రమంలో పైడిమాంబ భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న అమ్మవారి ఉత్సవ విగ్రహం

పేదింట ఆనందం





● ఉచిత గ్యాస్ పథకాన్ని స్వాగతిస్తున్న ప్రజలు

పేద కుటుంబాలకు ప్రభుత్వం ఊరట ఇచ్చింది. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి మూడు చొప్పున గ్యాస్ సిలిండర్ల పంపిణీకి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలి సిలిండర్ పొందేందుకు ఈ నెల 29 నుంచే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని కోరింది. డెలివరీ బాయ్‌కు మనం నగదు అందిస్తే.. తరువాత బ్యాంక్ ఖాతాలో ఆ నగదు జమ అవుతుంది. గ్యాస్ తీసుకున్న 48 గంటల్లో బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఏడాదికి మూడు సిలిండర్‌లంటే ఇప్పుడున్న ధరల ప్రకారం ఒక్కో కుటుంబానికి రూ.2,490 ఆదా అయినట్లే.

8లో



బీఎఫ్‌టీలదే ఇష్టారాజ్యం

● అర్హత లేకున్నా ఎమ్.బుక్ రికార్డుల నిర్వహణ
● పైఅధికారులే పురమాయిస్తున్న వైనం
● తప్పులతడకతో కూలీలకు తీవ్ర నష్టం
● ఉపాధి హామీ పథకం లొసుగుల్లో ఇదో కోణం

మెంటాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):


ఉపాధి హామీ పథకం అమలులో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. బీఎఫ్‌టీ(బేర్‌ఫుట్ టెక్నీషియన్)ల అతిజోక్యం, చేతివాటం పథకాన్ని అబాసుపాలు చేస్తోంది. అనవసర విషయాల్లో తలదూర్చుతూ పనిలో పనిగా నాలుగురాళ్లు పోగేసుకోవడంలో తామెవరికీ తీసిపోమని వారు పరోక్షంగా చాటుకుంటున్నారు. నియంత్రించాల్సిన అధికారులే ప్రోత్సహించడంతో యవ్వారం చేయిదాటిపోతోంది.

ఉపాధి పథకం అమలులో క్షేత్రస్థాయిలో మేట్‌లు మొదలుకొని మండలస్థాయిలో ఎంపీడీవో, ఏపీవో, వీరిమధ్యలో టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు...ఇలా ఎవరి బాధ్యతలు వారికి నిర్దేశించారు. అంతా పరిధికి లోబడి విధులు నిర్వర్తిస్తుంటారు. అయితే వీరుకాకుండా ప్రతి మండలానికీ ఒక బీఎఫ్‌టీని నియమించారు. మండల భౌగోళిక విస్తీర్ణం, ఆయా మండలాల్లో ఉపాధి పనుల అవసరాన్ని బట్టి కొన్ని మండలాల్లో ఇద్దరేసి చొప్పున ఏర్పాటు చేశారు. వీరికి ప్రత్యేక విధులంటూ కేటాయించలేదు. ఎంపీడీవో, ఏపివో, టెక్నికల్ అసిస్టెంట్లకు సహాయకారిగా ఉంటున్నారు. వీరి నియామక ఉత్తుర్వుల్లోనూ ఇదే బాధ్యతను పేర్కొన్నారు. అయితే బీఎఫ్‌టీలు అనవసర విషయాల్లో అతిజోక్యం ప్రదర్శిస్తూ పరిధికి మించి హల్‌చల్ చేస్తున్నారు. తగిన అర్హత లేకపోయినా ఎటువంటి శిక్షణ పొందకపోయినా సాంకేతిక వ్యవహారాల్లోనూ తలదూర్చుతున్నారు. ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్ల స్థాయిలో చేయాల్సిన ఎమ్.బుక్‌లో వేలుపెడుతున్నారు. ఇష్టానుసారంగా రికార్డు చేస్తున్నారు. మిడిమిడి జ్ఞానంతో ఎమ్.బుక్‌ల నమోదు చేస్తూ తప్పులతడకగా రికార్డులను తయారుచేస్తున్నారు. ఎంపిడీవోలుగానీ, ఏపీవోలు గానీ పట్టించుకోకపోగా, వారు చెప్పిన వివరాలనే ప్రామాణికంగా తీసుకోవడంతో లెక్కల్లో హెచ్చుతగ్గుల వల్ల అటు ఉపాధి కూలీలకు నష్టం జరుగుతోంది.

కొన్ని మండలాల్లో బీఎఫ్‌టీలదే రాజ్యం. ఎంపీడీవో, ఏపీవోల ఆదేశాల మేరకు ఎమ్.బుక్ లు రికార్డు చేస్తున్నామని దర్జాగా చెబుతున్నారు. పనిఒత్తిడి వల్ల కొన్నింటిని బీఎఫ్‌టీలకు అప్పగించక తప్పడంలేదని అటు ఎంపిడివోలు, ఏపీవోలు చెప్పుకొస్తున్నారు. కారణాలు ఏవైనప్పటికీ దీనివల్ల కొన్ని ఇబ్బందులు ఎదురువుతున్నాయని ఉపాధి వేతనదారులు ఆవేదన

మిగతా 10వ పేజీలో...

బాలికపై అత్యాచారయత్నం



గంట్యాడ/విజయనగరం క్రైం, అక్టోబరు(ఆంధ్రజ్యోతి): అభం శుభం ఎరుగని బాలికపై ఓ మృగాడు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన గంట్యాడలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలం కొటారుబల్లి కూడలిలో ఆదివారం ఓ ఫంక్షన్ జరుగుతుండగా అనకాపల్లి జిల్లాకు చెందిన బంధువులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ ఆడుకుంటున్న మూడున్నరేళ్ల బాలికకు ఇదే జంక్షన్‌కు చెందిన యువకుడు వి.రవి మాయమాటలు చెప్పి సమీప తోటలోకి తీసుకువెళ్లాడు. ఆపై అత్యాచారం యత్నానికి ప్రయత్నించటంతో చిన్నారి కేకలు వేసింది. కొందరు గమనించేసరికి నిందితుడు పారిపోయేందుకు ప్రయత్నించాడు. చుట్టుపక్కల వారంతా చేరుకుని ఆ యువకుడ్ని పట్టుకున్నారు. తల్లిదండ్రులు విజయనగరం దిశ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నర్సింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చీటింగ్

● కోట్ల రూపాయలు పోగొట్టుకున్న బాధితులు
● ఫిర్యాదు చేయలేక అంతర్మథనం
● భోగాపురం మండలమంతా ఇదే చర్చ

భోగాపురం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన డబ్బులను బ్యాంకులో ఉంచే కంటే చీటీ కడితే ఎక్కువ లాభం వస్తుందని ఆశ పడ్డారు. పిల్లల పెళ్లికో.. ఇంటి నిర్మాణానికో ఉపయోగపడతాయని భావించి కొంత డబ్బును ఓ ప్రైవేటు వ్యక్తికి నెలనెలా చెల్లించారు. ఇలా పది.. ఇరవై కాదు వందలమంది డబ్బులిచ్చారు. నమ్మకస్థుడైన వ్యక్తి అనుకుని కోట్ల రూపాయలు కట్టబెట్టారు. నమ్మకాన్ని నిలువునా ముంచేసి ఆ వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా ఉడాయించాడు. భోగాపురం చుట్టుపక్కల గ్రామాల్లోని ఈ బాధితులు కొద్దిరోజులుగా తమ కష్టాన్ని ఇతరులతో చెప్పుకుని బాధపడుతున్నారు. స్థానిక పెద్దల చుట్టూ తిరుగుతున్నారు. అయినా సమస్య పరిష్కారం కావడం లేదు. భోగాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చాలాకాలంగా చీటీలు నిర్వహిస్తున్నాడు. ఈ గ్రామంతో పాటు ఇతర మండలాల ప్రజలు కూడా అతని వద్ద చీటీ కడుతున్నారు. ఇటీవల ఆయన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని, చీటీల వేసిన వారికి డబ్బులు తిరిగి ఇవ్వలేనంటూ ప్రకటించి ఆత్మహత్యా యత్నం చేశాడు. ఆ తర్వాత కొద్దిరోజులు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. పూర్తి ఆరోగ్యంతో ఇంటికి వచ్చినా బాధితులకు మాత్రం డబ్బుల చెల్లింపుపై స్పష్టత ఇవ్వడం లేదు. బాధితుల్లో చిరువ్యాపారులు, రోజుకూలీలు, ఇంటిపని చేసుకొనేవారు ఎక్కువ మంది ఉన్నారు. సంవత్సరాల తరబడి దాచుకొన్నదంతా చీటీల రూపంలో పోగొట్టుకోవడంతో అనేక మంది బాధితులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. దీనిపై పెద్దలు, అధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.



బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

● తాత్కాలిక షాపులు శివార్లలో ఏర్పాటు చేసుకోవాలి
● ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ సమీపిస్తున్న నేపథ్యంలో బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలకు అనుమతులు తప్పనిసరని ఎస్పీ వకుల్‌జిందాల్ స్పష్టంచేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాణసంచా విక్రయించేందుకు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి అనుమతులు పొందాలన్నారు. తాత్కాలిక విక్రయాలు చేపట్టే వ్యాపారులు షాపులను నివాస ప్రాంతాలకు, ఆసుపత్రులకు దూరంగా ఉండేలా చూసుకోవాలని.. పట్టణ, గ్రామ శివార్లలోని బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలని సూచించారు. షాపుల మధ్య నిర్దిష్ట దూరం వుండాలన్నారు.. షాపుల వద్ద ప్రమాదాల నియంత్రణకు ఇసుక బస్తాలు, నీటి టబ్బులు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. షాపుల మధ్య ఎక్కువ మంది వ్యక్తులు గుంపులుగా ఉండకుండా, ఒకేసారి కొనుగోలు చేయకుండా చూసుకోవాలన్నారు. పాటించాల్సిన నిబంధనలు, హెచ్చరికలతో కూడిన బోర్డులను, ఫ్లెక్సీలను తాత్కాలిక షాపుల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. లైసెన్సులో అధికారులు సూచించిన సమయం వరకూ మాత్రమే దుకాణం తెరిచి ఉండాలని, నిబంధనలు అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.



బిందు సేద్యమే మేలు

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

8లో

ఆకట్టుకుంటున్న చెట్టు

● కోటిలింగాల పూలు పూచే చెట్టుగా పేరు
● సువాసనలతో మైమరపిస్తున్న అరుదైన పుష్పాలు

8లో



అందరి చూపు.. యోగా వైపు

8లో

● ఆరోగ్యానికి ఔషధంగా భావిస్తున్న ప్రజలు
● ఎంత బిజీగా ఉన్నా కొంత సమయం కేటాయింపు



50 ఏళ్లుగా అదే స్కూటర్

● రిటైర్డ్ ప్రొడక్షన్ మేనేజర్ సుంకరపల్లి ప్రత్యేకం

ఆయన 50 సంవత్సరాల నుంచి ఆ స్కూటర్ నడుపుతున్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు విశాఖ నుంచి బొబ్బిలికి ఆ స్కూటర్‌పై వెళ్లి వచ్చేశారు. ఉద్యోగ విరమణ పొందాక కూడా చిన్నచిన్న అవసరాలకు ఆ స్కూటర్‌నే వాడుతున్నారు. ఎందుకలా అని ప్రశ్నిస్తే సెంటిమెంట్‌గా కలిసివచ్చిందని, వదులుకోలేక ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేయిస్తూ వాడుతున్నానంటున్నారు. ఆయన పేరు బొబ్బిలి పట్టణానికి చెందిన సుంకరపల్లి వేణుగోపాలరావు. వయసు 82 సంవత్సరాలు. 1969 నుంచి బీహెచ్‌పీవీలో ప్రొడక్షన్ మేనేజరుగా చేరి 2001లో పదవీ విరమణ చేశారు. 1975 ఏప్రిల్‌లో బజాజ్ స్కూటర్‌ను కొనుగోలు చేశారు. సుమారు అర్ధ శతాబ్దకాలం నుంచి ఆయన ఆ స్కూటర్ నడుపుతున్నారు.

-బొబ్బిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి)



50 ఏళ్లుగా నడుపుతున్న స్కూటరు

అమర వీరుల త్యాగాన్ని గుర్తుచేస్తూ ఫ్లాష్‌మాబ్

బొబ్బిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ఆదివారం బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ అందరినీ ఆకట్టుకుంది. ఆనందో బ్రహ్మ డ్యాన్స్ అకాడమీకి చెందిన బాలికలు చేసిన నృత్యాలు అలరించాయి. పోలీసుల త్యాగాలను, కర్తవ్య నిబద్ధతను చాటే సినిమా పాటలను ఎంపిక చేసుకుని డ్యాన్సులతో అదరగొట్టారు. రిటైర్డ్ టీచర్ బీజీ గంగాధర్ పోలీసు అమర వీరుల సేవలను కొనియాడుతూ ప్రేరణ గీతాలను ఆలపించారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ కటకం సతీష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో మానవ హారంగా ఏర్పడి అమర వీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీసుల త్యాగాలను అన్ని వర్గాల గుర్తించి ఇలా కొనియాడుతుంటే తమ లో నూతనోత్సాహం కలుగుతోందన్నారు.



ఫ్లాష్ మాబ్ చేస్తున్న బాలికలు

పేదలకు వరం

● ఉచిత గ్యాస్ పథకానికి శ్రీకారం ● 29 నుంచి బుకింగ్‌కు అవకాశం ● జిల్లాలో లక్షల కుటుంబాలకు లబ్ధి





రాజాం/గజపతినగరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి)

పేద కుటుంబాలకు శుభవార్త. కూటమి ప్రభుత్వం ఉచిత గ్యాస్ పంపిణీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 29 నుంచే ఉచిత గ్యాస్ బుక్ చేసుకోవచ్చు. ఈ ఎన్నికలకు ముందు ఉచిత గ్యాస్ పంపిణీపై చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. తాము అధికారంలోకి వస్తే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు గ్యాస్ అందించేందుకు సన్నాహాలు చేశారు. దీపావళి నుంచి పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. 29న ఆయిల్ కంపెనీ ప్రతినిధులకు చెక్కులు అందించడం ద్వారా సీఎం చంద్రబాబు పథకానికి శ్రీకారం చుడతారు.


ప్రస్తుతం కట్టెల పొయ్యి వినియోగం గణనీయంగా తగ్గింది. ప్రతిఒక్కరూ గ్యాస్‌నే వినియోగిస్తున్నారు. అయితే గ్యాస్ సిలిండర్ ధర కేంద్ర ప్రభుత్వ రాయితీ పోనూ రూ.830గా ఉంది. సగటున నలుగురు కుటుంబసభ్యులు ఉండే ఇంట్లో నెల రోజులకు కూడా సిలిండర్ సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల వినియోగం సామాన్యులకు భారంగా మారింది. అందుకే చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేర్చుకునేందుకు ఇప్పుడు సిద్ధపడ్డారు.

30 ఏజెన్సీల పరిధిలో..

జిల్లాలో 30 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో 6,61,570 కనెక్షన్లు ఉన్నాయి. సగటున నెలకు 3 లక్షల వరకూ గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నట్టు ఒక అంచనా. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరగనుంది. తొలి గ్యాస్ సిలిండర్‌ను 2025 మార్చి 31 వరకూ పొందే చాన్స్ ఉంటుంది. తెల్లరేషన్‌కార్డు ప్రాతిపదికన దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ఈ పథకాన్ని వర్తింపజేశారు. ఏడాదిలో మూడు సందర్భాల్లో వీటిని విడిపించుకోవచ్చు. తెల్లరేషన్‌కార్డు, ఆధార్, గ్యాస్ కనెక్షన్ నంబర్లు ఏజెన్సీ ప్రతినిధులకు అందించాల్సి ఉంటుంది. అయితే గ్యాస్ కనెక్షన్ ఉన్నవారు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలి. మార్చి 31లోగా ఎప్పుడైనా ఫ్రీ గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవచ్చు. డెలివరీ బాయ్‌కు మనం నగదు అందిస్తే.. తరువాత బ్యాంక్ ఖాతాలో నగదు జమ అవుతుంది. గ్యాస్ తీసుకున్న 48 గంటల్లో బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందని అధికారులు చెబుతున్నారు.

రూ.2,490 ఆదా అయినట్లే..

ప్రభుత్వం అందజేసే మూడు ఉచిత సిలిండర్‌లలో మొదటి సిలిండర్ మార్చి 31లోపు, రెండోవది జూలై 31లోపు, మూడోవది నవంబర్ 30లోపు ఎప్పుడైనా పొందవచ్చు. ఈపథకం అమలకు ఏడాదిని మూడు బ్లాక్‌లుగా విభజించారు. అలాగే పథకం అమల్లో లబ్ధిదారులకు ఎటువంటి సమస్యలు ఎదురైనా టోల్ ఫ్రీ నెంబర్ 1967కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. సాధారణంగా సిలిండర్ ధర రూ.818 కాగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ఇంటికి వచ్చినప్పటికీ రూ.830కి చేరుతుంది. ఏడాదికి మూడు సిలెండర్‌లుఅంటే ఇప్పుడున్న ధరల ప్రకారం ఒక్కో కుటుంబానికి రూ.2,490 ఆదా అయినట్లే.



రుణపడి ఉంటాం..

కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. ఉచితంగా గ్యాస్ అందించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం శుభపరిణామం. పండుగ పూట ఖర్చులు అధికంగా ఉంటాయి. ఆ సమయంలో గ్యాస్ ఉచితంగా అందించడం అంటే లబ్ధి చేకూర్చడమే. కొంత కష్టాన్ని తగ్గించడమే. ఈ విషయంలో సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు.

-సంతోషి, గృహిణి, రాజాం

కొండంత అండ..

కుటుంబ జీవనమంటేనే చాలా కష్టంగా మారింది. పిల్లల చదువులు, ఇంటి అవసరాలకు చాలా ఇబ్బందికరంగా మారింది. ఈ పరిస్థితిలో ప్రభుత్వం ముందుకొచ్చి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తుండడం మంచి విషయం. పేద కుటుంబానికి ఇది కొండంత అండ.

-రమ, గృహిణి, రాజాం

అన్ని ఏర్పాట్లు..


ఉచిత గ్యాస్ పథకానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశాం. దీపావళి నుంచి పథకం ప్రారంభం కానుంది. ఈ నెల 29 నుంచి గ్యాస్ బుకింగ్ చేసుకోవచ్చు. గ్యాస్ డెలివరీ అయిన 48 గంటల్లో ఖాతాదారుల ఖాతాలో నిధులు జమ అవుతాయి. తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి వినియోగదారుడికి ఈ ఉచిత గ్యాస్ పథకం వర్తిస్తుంది. సమస్యలుంటే అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకురావొచ్చు.

-మధుసూదన్, డీఎస్‌డీవో, విజయనగరం

ఆకట్టుకుంటున్న కోటి లింగాల చెట్టు

● సువాసనలతో మైమరపిస్తున్న అరుదైన పుష్పాలు

కురుపాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అరుదైన కోటి లింగాల పుష్పాలు ఆహ్లాదకరమైన సువాసనలతో మైమరపిస్తున్నాయి. కురుపాం కోటలో ఉన్న ఈ అరుదైన చెట్టుకు పూచే పుష్పాలను ఈ ప్రాంతంలో కోటిలింగాల పువ్వులుగా పిలుస్తారు. దీనినే నాగమల్లి అంటారు. ఈ పువ్వు ఈశ్వరునికి అత్యంత ప్రీతిపాత్రమైనదిగా భక్తులు భావిస్తారు. కార్తీకమాసంలో ఈ పూలతో పూజచేసే అరుదైన అవకాశం చాలా కొద్ది మందికి మాత్రమే దక్కుతుంది. పువ్వు మధ్య లో లింగాకారం, పైన సర్పం పడగ ఆకారం లో ఎంతో విభిన్నంగా కనిపించే ఈ పుష్పం అక్టోబరు నుంచి డిసెంబరు వరకు మాత్రమే లభిస్తుంది. ఏ చెట్టుకైనా కొమ్మల నుంచి పూలు, కాయలు కాయడం సహజం. కానీ కోటి లింగాల చెట్టుకు మాత్రం తొర్రల నుంచి పొడవాటి ఊడలు వచ్చి వాటి నుంచే మొగ్గలు తొడుగుతుంది. అనంతరం ముదురు ఎరుపు రంగుతో అందమైన పుష్పాలు వికశిస్తాయి.



కోటి లింగాల చెట్టు

కోటి లింగాల పువ్వు

బిందు సేద్యమే మేలు

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఉద్యాన రైతులకు బిందు సేద్యం చాలా మేలు చేస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్ అవరణలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన బిందు, తుంపర సేద్యం పరికరాలను విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ అంబేడ్కర్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిందు సేద్యంతో భూగర్భ జలాల పరిరక్షణతో పాటు విద్యుత్ వినియోగం, సాగు ఖర్చులో ఆదా ఉంటుంద న్నారు. తద్వారా రైతుకు రాబడి పెరుగుతుందని చెప్పారు. నీటి వసతి (బోరు బావి), విద్యుత్ సౌకర్యం ఉన్నవారు ఎవరైనా ఈ పథకం కింద అర్హులేనని పేర్కొన్నారు. జిల్లాలో ఈ ఏడాది 3,050 హెక్టార్లలో బిందు సేద్యం చేయించాలని లక్ష్యంగా నిర్ణయించా మన్నారు. ప్రస్తుతం 86 మందికి రైతులకు 81.81 లక్షల విలువైన పరికరాలను రాయితీపై అందజేస్తున్నామని చెప్పారు. చిన్న, సన్న కారు రైతులకు తుంపర సేద్య పరికరాలను కూడా అందజేస్తామన్నారు. బిందు, తుంపర సేద్యం కింద పరికరాలను కావలసిన వారు రైతుసేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ పోర్టల్‌లో పేర్లును నమోదు చేసు కోవాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.



తుంపర సేద్యం పథకం మంజూరు పత్రాన్ని అందిస్తున్న మంత్రి శ్రీనివాస్

అందరి చూపు.. యోగా వైపు



ఆసనాలు ప్రాక్టీస్ చేస్తున్న దృశ్యం

● ఆరోగ్యానికి ఔషధంగా భావిస్తున్న ప్రజలు

● ఎంత బిజీగా ఉన్నా కొంత సమయం కేటాయింపు

రాజాం రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యోగా ఇటీవల కాలంలో విస్తృతంగా ప్రాచుర్యం పొందుతోంది. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాపై మక్కువ చూపుతున్నారు. కొంత సమయాన్ని కేటాయిస్తున్నారు. ఫలితంగా యోగా కేంద్రాలు, యోగా శిక్షకుల సంఖ్య కూడా పెరుగుతోంది. రోగాలను రూపుమాపే అద్భుతమైన శక్తి యోగాకు ఉందని ప్రపంచ వ్యాప్తంగా నమ్ముతున్నారు. దీర్ఘకాలిక రోగాలు తగ్గుతున్నాయన్న ప్రచారం కూడా ఉంది.

● పెరిగిన ప్రాధాన్యత..

యాంత్రిక జీవనం, ఒత్తిడి, వేగంతో కూడిన ఆధునిక సమాజంలో యోగా ప్రాధాన్యత పెరిగింది. నగరాలను దాటి పల్లెలనూ పలకరిస్తోంది యోగా..మనస్సు, శరీరం, ఆత్మ, పరమాత్మ కలయికే యోగా అని చెప్పవచ్చునంటున్నారు రాజాంకు చెందిన ప్రముఖ యోగా గురువు టీటీవీ రమణమూర్తి. యోగాపై తాను రచించిన పుస్తకంలో చాలా అంశాలను వెల్లడించారాయన. జిల్లాఅంతటా యోగాను అభ్యశిస్తున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంది. వైద్య నిపుణులు కూడా యోగా చేయాలని సూచిస్తున్నారు. వారు కూడా పాటిస్తున్నారు.

యోగా.. నియమాలు..

● సాధకులు విధిగా ప్రార్థనతో ప్రారంభించి ప్రార్థనతోనే ముగించాలి.

● ఆసనాలు వేసే ముందు నీరు తాగాలి.

● ఆదుర్దా, ఆందోళన, ఆకలి, అలసట ఉన్నప్పుడు యోగాకు దూరంగా ఉండాలి.

● యోగాసనాలు వేసే ముందు చన్నీళ్లతో స్నానం చేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది.

● తేలికైన వస్త్రాలు ధరించాలి.

● స్త్రీలు రుతుసమయంలో ఆసనాలు వేయకూడదు..

● గర్భిణులు శిక్షకుల పర్యవేక్షణలో ఆసనాలు ఎంపిక చేసుకోవాలి.

ఆసనాలు.. ఆరోగ్యం

● భుజంగాసనం.. పాము పడగ ఎత్తినట్లు ఆకారం కలిగిన ఈ ఆసనం వేయడం వల్ల చాతి భాగం విప్పారుతుంది. ఊపిరితిత్తులు బలపడతాయి. వెన్ను దృఢంగా ఉంటుంది. నడుంనొప్పి తగ్గుతుంది.

● ధనురాసనం....ధనస్సును పోలిన ఈ ఆసనం ఎత్తు పెరిగేందుకు తోడ్పడుతుంది. కీళ్ల సంబంధ వ్యాధులు తగ్గుతాయి. మలబద్ధకం పోతుంది. షుగర్ తగ్గుముఖం పడుతుంది.

● పశ్చిమోత్తాన ఆసనం.. ఈ ఆసనం ద్వారా పొట్ట సంబంధ వ్యాధులు తగ్గుతాయి. జననాంగాలకు వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

● ఉష్ట్రాసనం.. ఒంటె ఆకారాన్ని పోలే ఈ. ఆసనం వల్ల నడుంనొప్పి తగ్గి, వెన్ను సామర్థ్యం పెరుగుతుంది. సర్వైకల్ స్పాండిలైటస్ వ్యాధితో బాధపడేవారికి ఈ ఆసనం ఎంతో ఉపయోగపడుతుంది.

● శవాసనం.. దీనిని అమృతాసనం అని కూడా పిలుస్తారు... ఆసనాల ప్రారంభంలోనూ, మధ్యలోనూ, పూర్తయిన తరువాత కూడా దీనిని వేసుకోవాలి. దీనివల్ల శరీరానికి విశ్రాంతి లభిస్తుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది. అన్ని వయస్సుల వారూ దీనిని ఆచరించవచ్చు.

● శశాంకాసనం... చంద్రుని ముఖం వలె ప్రకాశించే రూపును కలిగించే ఈ ఆసనంతో తలనొప్పి, ఒత్తిడి తగ్గుతుంది. ఊపిరితిత్తులకు ప్రాణవాయువు అందజేస్తుంది. చిరాకు, కోపం వంటివి మెల్లగా తగ్గుముఖం పడతాయి.

దీర్ఘకాలిక రోగాలు తగ్గుముఖం..



యోగాభ్యసన వల్ల షుగర్, బీపీ, ఆస్తమా వంటి దీర్ఘకాలిక రోగాలు తగ్గుముఖం పడతాయి. ప్రాణాయామం వల్ల మనిషి శారీరక, మానసిక ప్రవర్తనలో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. ఆలోచించే శక్తి, క్షమించే గుణం పెరుగుతుంది. దూకుడుతనం తగ్గి ప్రేమించే మనస్తత్వం పెరుగుతుంది. మహిళల్లో ఇంకా చైతన్యం రావాలి. వ్యాధులతో సతమతమవుతూ అవస్థలు పడుతున్న వారికి యోగాభ్యాసం ఉపశమనం కలిగిస్తుంది.

-రమణమూర్తి, యోగా గురువు, రాజాం

పూడిక ఇలా .. పారేదెలా ?

● వ్యర్థాలతో నిండిన గెడ్డలు ● వర్షం వస్తే గ్రామంలోకి వరద నీరు ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తెర్లాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అధికారులు, నాయకుల నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గెడ్డలు, కాలువలలో నిర్వహణ పనులు చేపట్టపోవడం స్థానికులు, రైతులకు ఇబ్బందిగా మారింది.

మండలంలో పలు ప్రాంతాల్లో ఉన్న గెడ్డలు వర్థాలతో పూడుకుపోతున్నాయి. దీంతో నీరు ప్రవహించక గ్రామాల్లోకి వరద చేరుతోంది. దీంతో గెడ్డలకు దిగువన ఉన్న గ్రామాలైతే ఆందోళనకు గురవుతున్నాయి. వర్షం కారణంగా గెడ్డలలో ఎక్కడినీరు అక్కడ ఉండడం చేత, సమీప గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. పూడికలు తీయించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైందని ఆయాగ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం అధిక వర్షం మెరకముడిదాం మండలంలో పడడం చేత అక్కడి నుంచి తెర్లాం గ్రామానికి ఆనుకుని ఉన్న మంగళిగెడ్డకు వరద పోటెత్తింది. దీనితో దిగువన ఉన్న నందిగాం జలమయమైంది. అప్పటిక ప్పుడు అధికారులు కొంత మేరకు చర్యలు తీసుకున్నా ఇంకా పూర్తి స్థాయిలో మంగళిగెడ్డ పనులు అలానే ఉన్నాయి. మంగళిగెడ్డ పూడికల కారణంగా అంట్లావార, కూసుమూరు, వంతరాం ప్రధాన రహదారి మధ్య ఉన్న కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో ఆ గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెలగవలస సమీపంలోని వెంకటరాయచెరువుదీ ఇదే పరిస్థితి.



తెర్లాం సమీపంలో ఉన్న మంగళిగెడ్డ దుస్థితి

వరదలు వచ్చినప్పుడు నరకమే

ఉధృతంగా వరద వచ్చినప్పుడల్లా బయాందోళనకు గురవుతున్నాం. గ్రామ సమీపాన ఉన్న కానాల ద్వారా చెరువులకు వెళ్లవలసిన నీరు, అవి పూడుకుపోవడంతో నీరు పోయే దారి లేక ఊరిలోనికే వస్తోంది. దీనిపై కల్వర్టు నిర్మిస్తే బాగుండేది.

-అర్నెపల్లి సంగాం, నీటి సంఘం అధ్యక్షుడు, నందిగాం

కల్వర్టు నిర్మించాలి

అధిక వర్షాలు పడినప్పుడు గ్రామంలోకి వరద నీరు వస్తోంది. దీనివల్ల గ్రామంలోని లోతట్టు ఇళ్లలోకి నీరు చేరుతోంది. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడు ఎమ్మెల్యే దీనిని బాగు చేస్తామని హామీ ఇచ్చారు.

-మరడాన రవి, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు, నందిగాం

న్యూస్ బాక్స్

బీఎస్ఎన్ఎల్ విజిలెన్స్ వారోత్సవాలు

విజయనగరం రూరల్, అక్టోబరు 27: నగరంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఈ నెల 28 నుంచి వచ్చే నెల 3 వరకూ విజిలెన్సు అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు విజయనగరం డిప్యూటీ జనరల్ మేనేజరు దాలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం రెండు జిల్లాల ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ వారోత్సవాల్లో ఉద్యోగులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బకాయిలను చెల్లించాలి

విజయనగరం రూరల్, అక్టోబరు 27: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను చెల్లించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి శ్యామ్ డిమాండ్ చేశారు. ఆదివారం అమర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సంఘ సమావేశానికి శ్యామ్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎస్ఎస్ దొర, శ్రీరామ్, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

మందుగుండు సామగ్రి విక్రయానికి నిబంధనలు తప్పనిసరి

బాడంగి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దీపావళి మందుగుండు సామగ్రి అమ్ముకునే షాపు తాత్కాలిక లైసెన్సును గత సంవత్సరం అధికారులు నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేశారని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ, ఎంపీటీసీ పాలవలస గౌరు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పాఠశాలలు, దేవాలయాలు, జనావాసాలకు దూరంగా మందుగుండు సామగ్రి షాపులు ఉండాలని, ఫైర్‌సేఫ్టీ ఎక్విప్‌మెంట్స్ ఉండాలని, జిల్లా అధికారులు సూచనలమేరకే లైసెన్స్‌ను మంజూరు చేయాలని కోరారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 27: చెన్నైలోని ఆంధ్రాభవన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో విజయనగరం టీడీపీ ఎంపీపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆదివారం పాల్గొన్నారు. చైన్నైలోని ఆంధ్రాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ నాయకులను, కార్యకర్తలను కలిశారు. 40 శాతం వున్న తెలుగువారు శాశ్వత సభ్యత్వం తీసుకోవడం ద్వారా వారి సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అవకాశాలు ఉంటాయన్నారు.

గిరిజన మహిళలకు చీరల పంపిణీ

బొబ్బిలి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ శివారు దేవెనవలస గిరిజన గ్రామంలో ఆదివారం వనమిత్ర కృష్ణదాస్ గిరిజన గూడెంలో నివసిస్తున్న గిరిజనులను పలుకరించి అక్కడ ఉన్న మహిళలు, బాలలు, వృద్ధులకు చీరలు, చిన్న పిల్లలకు బిస్కెట్ పాకెట్లు, నిత్యవసరాలు ఉచితంగా పంపిణీ చేసారు. వనమిత్ర కృష్ణదాస్, గ్రామస్తులు, పిల్లలు, మహిళలు పాల్గొన్నారు.

బొద్దాంలో మెగా కంటి వైద్య శిబిరం

వేపాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దాం గ్రామంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరంలో 60మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్టు ఆప్తాలమిక్ అసిస్టెంట్ సత్యవతి తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించే ఈ వైద్య శిబిరానికి ముకుందపురం, బొద్దాం, ఓబులయ్యపాలెం, రామస్వామిపేట, కొత్తబొద్దాం గ్రామాలకు చెందిన కంటి రోగులు హాజరు కాగా వీరందరికీ కంటి పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలకు 25 మందిని ఎంపిక చేశామన్నారు. క్యాంపు ఆఫీసర్ ఎం.అరుణ కుమార్, నర్సింగ్ స్టాఫ్ అమల, ఆస్పత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారం వద్దు

రాజాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు చార్జీల పేరిట విద్యుత్ బిల్లులను ఈ ప్రభుత్వం దారుణంగా పెంచిందని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మీనారాయణ విమర్శించారు. ఆదివారం రాజాంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో భారం వేయడం తగదన్నారు. ఎపీపీసీపీ చార్జీల పేరిట రూ.ఆరు వేల కోట్లకు పైగా భారం వేసి పేదలు మధ్యతరగతి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని లక్ష్మీనాయుడు డిమాండ్ చేశారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

విజయనగరం దాసన్నపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులంతా సమాయత్తం కావాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ బుకారిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం కోట జంక్షన్‌లోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీటీఎఫ్ అభ్యర్థి, ప్రస్తుత ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడు పాకలపాటి రఘువర్మ గెలుపునకు కృషి చేసేందుకు ఏపీటీఎఫ్ జిల్లా ఎన్నికల కమిటీని ఏర్పాటు చేశారన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు జోగినాయుడు, కె శ్రీనివాసన్, మజ్జి రమేష్, కర్రి రవి, భాస్కరరావు, ఎం శ్రీనివాసరావుతో పాటు, అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

హరిత దీపావళి చేసుకుందాం

బొబ్బిలి అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మనమంతా ఆనందోత్సాహాల నడుమ హరిత దీపావళిని జరుపుకుందామని గ్రీన్ బెల్ట్‌సొసైటీ నినదిస్తూ పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి దీపాలను వెలిగించి నినాదాలు చేశారు. సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేత కె.విజయగౌరి, వార్డు కౌన్సిలరు మరిపి తిరుపతిరావు, కె.కృష్ణదాసు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొండపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ మరువాడ, గిట్టుపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం బొండపల్లి మండలం మరవాడ గ్రామానికి చెందిన వెల్లూర్తి సత్యంకు రూ.2.15 లక్షల చెక్కును, గిట్టుపల్లి గ్రామానికి చెందిన నవ్యకు రూ.2.28లక్షల చెక్కును రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతులమీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు తెలుగుదేశం ప్రభుత్వం అన్ని విధాలా ఆసరాగా ఉంటుందన్నారు. గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండబాబు, బొండపల్లి మండల పార్టీ అధ్యక్షులు కోరాడ కృష్ణ, కెరటాం సర్పంచ్ నంబూరి రాజేష్ (బుచ్చిరాజు), మరువాడ సర్పంచ్ డోకుల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తూర్పుకాపు సంఘం మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు

సంతకవిటి: విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సంతకవిటి మండలం కాకరాపల్లి పంచాయతీ నుంచి వైసీపీకి చెందిన 20 కుటుంబాలు తేదేపా తీర్థం పుచ్చుకున్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ తూర్పుకాపు చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, సంతకవిటి మండల టీడీపీ అధ్యక్షులు గట్టి భాను ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. వీరిలో వావిలపల్లి రామకామేశ్వరరావు, సీతారాం, శ్రీరాములు, బాలకృష్ణ, రామకృష్ణ, చాపల సోమేశ్వరరావు, లోలుగు చిన్నంనాయుడు, గెడెల ఆదినారాయణ, ముంజేటి అప్పారావు, ధర్మారావు వీరంతా చేరారు. వీరితో పాటు వీరి అనుచరులు, కుటుంబ సభ్యులు చేరారు. కార్యక్రమంలో మండల తెలుగు యవత అధ్యక్షులు వావిలపల్లి శ్రీనావాస్, దన్నాన భావనారాయణ, వావిలపల్లి సూరిబాబు, కాకరాపల్లి పంచాయతీ నాయకులు పాల్గొన్నారు.

చెరువు గట్టుపై ఆక్రమణల తొలగింపు



మట్టిని తొలగించి కబ్జా చేసిన చెరువును చదును చేస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధి మిలటరీ కాలనీ పక్కన ఉన్న ప్రభుత్వ చెరువును బీఎస్ఆర్ ప్రాపర్టీస్ యాజమాన్యం కబ్జా చేసిన విషయం తెలిసిందే. ఆదివారం తహసీల్దార్ శ్రీను, రెవెన్యూ యంత్రాంగం కబ్జా చేసిన చెరువు వద్దకు వెళ్లి పరిశీలించి, హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. కబ్జాకు గురైన చెరువు భాగాన్ని చదును చేయించి చెరువును పరిరక్షించే ఏర్పాటు చేశారు. వెంటనే స్పందించి చెరువును పరిరక్షించిన రెవెన్యూ యంత్రాంగానికి సీపీఐ తరపున జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ చెరువు గట్టుపైన, బఫర్ జోన్‌లో నిర్మించిన అక్రమ కట్టడాలపై ఎమ్మార్వో స్పందించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందిస్తున్నాం

● సెంచూరియన్ యూనివర్శిటీ డీన్ ప్రఫుల్‌కుమార్ పండా



మాట్లాడుతున్న డీన్ ప్రఫుల్ కుమార్ పండా

అరసవల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో స్కిల్ పెంపొందించి పెద్ద పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామని సెంచూరియన్ యూనివర్శిటీ డీన్ ప్రఫుల్‌కుమార్ పండా తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో యూనివర్శిటీ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. అనంతరం ప్రఫుల్‌కుమార్ పండా మాట్లాడుతూ ఉద్యోగాలు, వ్యాపారాలకు సంబంధించి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. విద్యా సంబంధమైన సమస్యలు, ఉద్యోగ నియామకాల గురించి వివరించారు. స్మార్ట్ వ్యవసాయం, పశువైద్యం, ఫార్మసీ, నర్సింగ్, ఇంజనీరింగ్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన కోర్సుల వివరాలను తల్లిదండ్రులకు తెలియజేశారు. ప్లేస్‌మెంట్ డీన్ కామేశ్వరం వివిధ కంపెనీలు, ఉద్యోగాల విషయాలను వివరించారు. విద్యార్థులకు చక్కని కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం, క్రమశిక్షణ వంటి అంశాలను కూడా బోధిస్తున్నామని తెలిపారు. తమ యూనివర్శిటీలో చదువుకున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. తమ వర్సిటీలో 23 రాష్ట్రాలతో పాటు, విదేశీ విద్యార్థులు కూడా అభ్యసిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్ వేణుగోపాల్, చంద్రకాంతరెడ్డి, లింగరాజు మహాపాత్రో, ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ క్రీడకు మరింత గుర్తింపు తేవాలి

● ఎస్‌కోట ఎమ్మెల్యే లలిత కుమారి



విజేతలకు ట్రోఫీని అందిస్తున్న లలిత కుమారి, జడ్పీటీసీ, ఎంపీపీ

కొత్తవలస, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ క్రీడకు మరింత ప్రాచుర్యం కలిగే విధంగా కృషి చేయాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తవలసలోని భారత్ డిఫెన్స్ అకాడమీ ప్రాంగణంలో 68వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభించి అనంతరం విజేతలకు మెమొంటోలను అంద చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హ్యాండ్ బాల్ గేమ్ కూడా వాలీబాల్ క్రీడలాంటిదే అయినప్పటికీ చాలా మందికి సరైన అవగాహన లేదన్నారు. హ్యాండ్‌బాల్ క్రీడకు ప్రాముఖ్యం కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు కాగా పోటీల్లో విజయనగరం జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానం, విశాఖపట్టణం జట్టు తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. విజేతలకు లలిత కుమారి మెమొంటోలను అందించారు. ఆర్ఐవో నారాయణరావు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కె.కృష్ణంరాజు, డిఫెన్స్ అకాడమీ డైరక్టర్ కె.రాజు, రాష్ట్ర వాలీబాల్ రిఫరీ ఎల్‌జీన్ కుమార్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, జడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, పీవీ రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం అంటేనే ఒక గౌరవం

కొత్తవలస: తెలుగు దేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడాన్ని గౌరవంగా భావించాలని శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి అన్నారు. ఆదివారం కొత్తవలసలో ఆమె బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావుతో కలసి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒక రూపాయితో ప్రారంభమైన తెలుగుదేశంపార్టీ సభ్యత్వం 100 రూపాయలుకు చేరిందంటే పార్టీ ఎంత బలిష్టంగా ఉందో తెలుసుకోవచ్చునని తెలిపారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకునే వారికి పార్టీ తరపున ఎన్నో ప్రయోజనాలను కల్పిస్తున్నట్టు తెలిపారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీకి విద్యార్థి ఎంపిక

గజపతినగరం, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తుపాకుల రవి జాతీయ స్థాయి జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ నాయుడు ఆదివారం తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో విజయనగరంలో రాజీవ్ ప్రైడా మైదానంలో జరిగిన ఖోఖో పోటీలకు రాష్ట్రస్థాయిలో ఎంపిక అయిన రవి చిత్తురు జిల్లా కానిపాకంలో జరిగిన రాష్ట్ర స్థాయిలో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపిక అయినట్లు తెలిపారు. మరుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పీడీ సత్యనారాయణ తర్ఫీదు ఇచ్చినట్లు తెలిపారు.

ఉత్సాహంగా మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు



విజయనగరం టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆనంద గజపతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి 29వ మిస్టర్‌ఆంధ్ర బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌కౌశిక్ ప్రారంభించారు. ఈ పోటీల్లో తొలి ఐదు స్థానాల్లో నిలిచిన బాడీబిల్డర్లకు నగదు బహుమతులు, షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు కనకల కృష్ణ, వి.రమేష్, ఉపాధ్యక్షులు శ్రీనివాస వర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు ఎంపిక

శృంగవరపుకోట, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఖండేపల్లి గ్రామానికి చెందిన పతివాడ వినయ్ ఈనెల 30నుంచి నవంబరు 3వరకు చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించబోయే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ కబడ్డీపోటీలకు ఎంపికయ్యాడు. యువకుడిని రాష్ట్ర సీనియర్ కబడ్డీ క్రీడాకారులు బుగత వెంకటేశ్వరరావు, రేగలబంద చిట్టిబాబు ఆదివారం అభినందించారు. టీడీపీ నాయకులు కాపుగంటి వాసు, బంగారమ్మ, దొమ సన్యాసిరావు, పెదగాడ రాజు, బ్రహ్మాజీ, వీరభద్రుడు తదితరులు ఉన్నారు.



వినయ్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

గంజాయితో ఇద్దరి అరెస్టు

శృంగవరపుకోట రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర చెక్‌పోస్టు వద్ద అల్లూరి సీతారామరాజు జిల్లా అరుకు నుంచి విశాఖపట్టణానికి 900 గ్రాముల గంజాయి తీసుకెళ్తున్న ఇద్దరు యువకులను పట్టుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు. ఆదివారం ఎస్ఐ మాట్లాడుతూ విశాఖపట్టణానికి చెందిన కొప్పల లోకేష్, చదరం మోహన్ గంజాయి తీసుకెళ్తుండగా పట్టుకున్నామని, వారిని న్యాయస్థానంలో హాజరుపరుస్తామన్నారు.

ఇరు వర్గాల మధ్య కొట్లాట

సంతకవిటి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సంతకవిటి మండలంలో హొంజరం గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇరువురికి చెందిన పంటపొలాల గట్టు వద్ద నీళ్ల కోసం కొట్లాట జరిగి, ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువురు పోలీసుస్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గోపాలరావు తెలిపారు.

భర్తపై ఫిర్యాదు

సంతకవిటి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో ఆలుమగల మధ్య గొడవతో ఓ మహిళ పోలీస్‌స్టేషన్ తలుపుతట్టింది. తన భర్త తరచూ అనుమానం కారణంగా వేధిస్తున్నాడని ఆరోపించింది. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఎస్సై గోపాలరావు విచారణ చేసి మహిళకు న్యాయం చేస్తానన్నారు.

అన్నంరాజుపేట సొసైటీ సీఈవోపై ఫిర్యాదు

జామి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నంరాజుపేట సహకార సంఘం సొసైటీ సీఈవోపై జామి మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు ఆదివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈవిషయంపై మాజీ జడ్పీటీసీ మాట్లాడుతూ 2021 రైతులకు ఇవ్వాల్సిన రవాణా చార్జీలను చెల్లించాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ ఇవ్వకపోవడంతోపాటు పలుమార్లు ఈవిషయంపై రైతులతో కలిసి అడిగినా స్పందించకపోవడంతో ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై ఎస్ఐ వీరజనార్దన్ స్పందించి సీఈవోను స్టేషన్‌కు రప్పించారు. కొద్దిరోజుల సమయంలో ఇస్తామని ఆయన తెలిపారు.

కోడిశలో శాంతికమిటీ

రేగిడి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో కోడిశ గ్రామంలో ఇటీవల రాజకీయ విబేధాలు, వ్యక్తిగత వైరుధ్యాలతో గ్రామంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయి. కొట్లాట ఘటనలు, ఆటోదహనం, పరస్పర కేసులు నమోదవడంతో చర్యలు తీసుకునేందుకు రేగిడి ఎస్ఐ నీలావతి సిద్ధమయ్యారు. ఈక్రమంలో ఆదివారం గ్రామంలో రెండుపార్టీల పెద్దలతో ఎస్ఐ సమావేశమై గ్రామంలో శాంతికమిటీ ఏర్పాటుచేశారు. సర్పంచ్ గురువాన రమేష్, మాజీ సర్పంచ్ నెల్లి పెంటన్నాయుడు, మరికొంతమంది గ్రామపెద్దలు, ఎస్ఐ, ఏఎస్ఐ, మహిళా పోలీస్ ప్రతినిధులుగా ఒక కమిటీని ఎంపికచేశారు.

ఆశయ రమణ మృతి



రమణ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు, ఇన్‌సెట్లో రమణ (ఫైల్)

చీపురుపల్లి, అక్టోబరు 27: (ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యకర్త, బైక్ లైబ్రరీ వ్యవస్థాపకుడు, ఆశయ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి రమణ ఆదివారం మరణించారు. పట్టణంలోని జి. అగ్రహారానికి చెందిన 43 సంవత్సరాల రెడ్డి రమణ పలు సేవాకార్యక్రమాలు నిర్వహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులందుకున్నారు. వందలసార్లు రక్తదానం చేశారు. రాజాంలోని ఓ ప్రవేటు విద్యాసంస్థలో లైబ్రేరియన్‌గా పని చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, యువతకు పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించాలన్న లక్ష్యంతో బైక్ లైబ్రరీని నెలకొల్పి వందలాది మైళ్లు ప్రయాణం చేసి, వేలాది పుస్తకాలు పంపిణీ చేశారు. దాతలను కూడగట్టి, వారి నుంచి స్వీకరించిన విరాళాలతో లక్షలాది పుస్తకాలతో పట్టణంలో ఒక ప్రజా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 19న పట్టణానికి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయం కావ డంతో, ఆయనను విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూసారు. ఆదివారం రమణ భౌతిక దేహాన్ని పట్టణానికి తీసుకురావడంతో, పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన అభిమానులు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు ఆంజనేయపురం నుంచి జి. అగ్రహారంలోని శ్మశాన వాటిక వరకూ అంతిమయాత్ర నిర్వహించారు. గతంలో ఆయన సమర్పించిన అంగీకారం పత్రం మేరకు విజయనగరంలోని రెడ్‌క్రాస్ సంస్థ వైద్యులు, ఎంఆర్ ఆసుపత్రి వద్ద రమణ కార్నియాను ఆదివారం సేకరించారు.

పైడితల్లమ్మ విగ్రహాల ఆవిష్కరణ



బంగారమ్మతల్లి అమ్మవారు, పూజలు చేస్తున్న భక్తులు

రామభద్రపురం, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆరికతోట గ్రామంలో ఆదివారం పెదపైడితల్లమ్మ, చినపైడితల్లమ్మ, బంగారమ్మతల్లి విగ్రహాలను వేదమంత్రోచ్చారణల మధ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ప్రారంభోత్సవం చేశారు. మిర్తిపాటి సురేష్ దంపతులు ఈ ఆలయాన్ని పునఃనిర్మించారు. వేద పండితులు వై.ప్రసాద్‌శర్మ, కే.శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. అనంతరం అమ్మవార్ల విగ్రహావిష్కరణ వైభవోపే తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రసాద్‌శివచార్యా, శ్రీనివాసాచార్య, హేరంబ దీక్షితా చార్యా తదితర పురోహితుల మధ్య నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

చెకుముకి సంబరాలు



మాట్లాడుతున్న వక్తలు

విజయనగరం టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం పలు పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు పేరుతో ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరైన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డాక్టర్ సన్యాసమ్మ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 34 టీమ్‌లు పాల్గొనగా డెంకాడ జెడ్పీ ఉన్నత పాఠశాల, విజయనగరం ది నేషనల్ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. వచ్చే నెల 9, 10న విశాఖలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఉద్యోగుల సన్నాహక సమావేశం

విజయనగరం టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జోన్- 1 పరిధిలోని పంచాయతీరాజ్ అధికారులు, ఉద్యోగులు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, మినిస్ట్రీరియల్ సిబ్బంది, పంచాయతీ విస్తరణాధికారులు, ఎంపీడీవోలు, డీడీవోలు హాజరయ్యారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో బి.వి.సత్యనారాయణ గౌరవ అతిథిగా పాల్గొనగా వివిధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బీఎఫ్‌టీలదే ఇష్టారాజ్యం



ఉపాధి పనులు నిర్వహిస్తున్న దృశ్యం

(7వ పేజీ తరువాయి)

వ్యక్తం చేస్తున్నారు. ఎమ్‌.బుక్‌ల నమోదు పేరుతో బీఎఫ్‌టీలు బాగానే లబ్ధి పొందుతున్నట్టు తెలియవస్తోంది. ఎమ్‌.బుక్‌ నమోదుకు ఫీల్డ్‌ అసిస్టెంట్లు వేతనదారులు నుంచి తలా కొంత వసూలు చేసి టెక్నికల్‌ అసిస్టెంట్లకు ముట్టజెప్పడం ఉపాధిలో ఓపెన్‌ సీక్రెట్‌! ఇది ఆరంభం నుంచి వస్తున్న ఆనవాయితీయే. ఇప్పుడు వారికి ఇచ్చే మొత్తాన్ని పైఅధికారుల సూచన మేరకు బీఎఫ్‌టీలకు ఇస్తున్నామన్నది ఫీల్డ్‌ అసిస్టెంట్ల మాట. ఇలా వేతనదారులు నుంచి వసూలు చేసిన మొత్తంలో కొంత నొక్కేస్తామన్న నిజాన్ని దాచి, అలా ఇవ్వకపోతే కొలతలు తగ్గించి నమోదు చేస్తే కూలీలకు నష్టం వాటిల్లుతుందని సదరు ఫీల్డ్‌ అసిస్టెంట్లు ఎక్కడలేని ప్రేమ ఒలకబోస్తుండడం గమనార్హం. మొత్తమ్మీద ఉపాధిలో అధికారులు, ఉద్యోగుల లంచాలాటలో బలవుతున్నది ముమ్మాటికీ వేతనదారులే!

ఉపాధి మేట్‌లుగా పని చేసిన వారిని 2017లో పదోవ తరగతి అర్హత మేరకు బీఎఫ్‌టీ లుగా నాయమించారు. కొన్నేళ్లపాటు బాగానే విధులు నిర్వహించినా 2020 తరవాత నిబంధనలను కాలరాస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఏడేళ్లుగా సొంత మండలాల్లో తిష్ట వేయడం పలు విమర్శలకు తావిస్తోంది.

గ్రామాభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే నాగమాధవి



రఘును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం/పూసపాటిరేగ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతంతో పాటు గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ఆదివారం కొవ్వాడ అగ్రహారం సర్పంచ్‌ కోట్ల రఘు ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీని వీడి జనసేనలోకి చేరారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిపై జనసేన పార్టీ ప్రత్యేక దృష్టి సారిస్తోందని అన్నారు. సర్పంచ్‌తో పాటు మాజీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, అనుచరులు జనసేన పార్టీలో చేరారు. అంతకుముందు నాతవలస కూడలి నుంచి కొవ్వాడ అగ్రహారం వరకు సుమారు 1,500 బైకులతో ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యేని ఘనంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు వందనాల రమణ, జె.అప్పుడుదొర, నాయకులు మట్టా అయ్యప్పరెడ్డి, పతివాడ శ్రీను పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



పార్కును పరిశీలిస్తున్న ఆనంద్‌కుమార్‌

నెల్లిమర్ల, అక్టోబరు27 (ఆంధ్ర జ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌ కుమార్‌ తెలిపారు. 13, 14 వార్డుల్లో ఆయన ఆదివారం పర్యటించారు. గాంధీనగర్‌ కాలనీ పార్కు సందర్శించారు. కాలనీకి చెందిన రెబల్‌స్టార్‌ యూత్‌ ప్రతినిధులు ఆనంద్‌కుమార్‌ని కలిసి ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని, పార్కు స్థలానికి ప్రహరీ నిర్మించి, యువత కోసం జిమ్‌ని ఏర్పాటు చేయలని, స్థానికుల కోసం కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్కు అభివృద్ధికి, వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. టీడీపీ నాయకులు మజ్జి ఆదినారాయణ, ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు.

పాల ధరలు తగ్గించడం అన్యాయం

బెలగాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పాల ధరలను తగ్గించడం అన్యాయమని ఏపీ పాల రైతుల సంఘం నాయకుడు కె.అజయ్‌కుమార్‌ అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో పాల ధరలపై గాజువాకలో నిర్వహించే ధర్నాకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం లోని విశాఖ డెయిరీలో విక్రయిస్తున్న పాల ధరలను రూ.4 నుంచి రూ.3లకు తగ్గించడంతో పాడి రైతులు చాలా ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. దీనిని ఖండిస్తూ ఈనెల 29న గాజువాకలో నిర్వహించే మహా ధర్నాకు రైతులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కృష్ణమూర్తి, బంటు దాసు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో ఏనుగుల సంచారం

భామిని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తివ్వకొండకు ఆనుకుని ఉన్న మాసగూడ, జామిగూడ ప్రాంతాల్లో ఏనుగులు గత రెండు రోజులుగా సంచరిస్తున్నట్టు ఫారెస్ట్‌ బీట్‌ ఆఫీసర్‌ దాలినాయుడు తెలిపారు. శుక్రవారం రాత్రి నాలుగు ఏనుగులు జామిగూడ ప్రాంతానికి చేరుకోగా ఆ రెండు గ్రామాల మధ్యలో తోటల్లోనే సంచరిస్తున్నాయన్నారు. దీనితో గిరిజనులు భయాందోళనలకు గురవుతున్నారు. వేరే ప్రాంతాలకు వెళ్లి రావడానికి భయపడుతున్నారు. గత ఐదు నెలల క్రితం ఘనసర, తాలాడ, కీసర ప్రాంతాల్లో తిష్టవేసిన ఏనుగులు అక్కడ వర్షాల వల్ల పొలాలు బురదమయం కావడంతో కొండపై ప్రాంతంలో గుమ్మలక్ష్మీపురం, కురపాం ప్రాంతాల్లో సంచరించాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మళ్లీ తాలాడ, ఘనసర ప్రాంతాల్లో మరో 8 నెలలు సంచరిస్తాయని, పంటలు నాశనం చేస్తాయని గిరిజనులు దిగులు చెందుతున్నారు. అయితే పోలీసులు, ఫారెస్ట్‌ అధికారులు ఏనుగుల వల్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు చేస్తున్నారు.



తోటల్లో సంచరిస్తున్న ఏనుగులు

ఇలా ఉంటే రోగాలు రావా?

▸▸ అధ్వానంగా మురుగు కాలువలు

డెంకాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలోని గుర్లలో డయేరియా వ్యాప్తి చెందిన నేపథ్యంలో పారిశుధ్యంపై శ్రద్ధ కనబరచాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారి నిర్లక్ష్యానికి ఈ చిత్రమే నిదర్శనం. ఇదీ డెంకాడ మండలం గుణుపూరు గ్రామంలోని మురుగు కాలువ దుస్థితి. తాగునీటి కొళాయి పక్కన ఉన్న కాలువ చెత్తతో పేరుకుపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇలా అయితే రోగాలు రావా.. అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని చాలా గ్రామాల పరిస్థితి ఇలాగే ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.



గుణుపూరు కాలువల్లో పేరుకుపోయిన చెత్త

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్‌ పోటీలకు 17 మంది ఎంపిక



రెజ్లింగ్‌ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

నెల్లిమర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో వచ్చే నెల 9, 10 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్‌ రెజ్లింగ్‌ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక పోటీలు కొండవెలగాడలో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఫ్రీస్టైల్‌ విభాగంలో ఆరుగురిని, గ్రీకో రోమన్‌ విభాగంలో ఆరుగురిని, స్త్రీల విభాగంలో ఐదుగురిని మొత్తం 17 మందిని జిల్లా జట్లకు ఎంపిక చేసినట్టు జిల్లా రెజ్లింగ్‌ అసోసియేషన్‌ కార్యదర్శి పి.లక్ష్మణరావు, ప్రతినిధులు వి.వెంకటరమణ, కె.శేఖర్‌ చెప్పారు. పురుషుల ఫ్రీ స్టైల్‌లో 57 కిలోల విభాగంలో జి.పవన్‌ కుమార్‌, 61 కిలోల విభాగంలో డి.కరుణానిధి, 65 కిలోల విభాగంలో జి.బంగారునాయుడు, 70 కిలోల విభాగంలో వి.జగదీష్‌, 74 కిలోల విభాగంలో ఎం.సునీల్‌కుమార్‌ ఎంపికైనట్టు తెలిపారు. అలాగే గ్రీకో రోమన్‌ స్టైల్‌లో 55 కిలోల విభాగంలో ఎం.సునీల్‌, 63 కిలోల విభాగంలో జి.సత్యంనాయుడు, 67 కిలోల విభాగంలో పి.నితిన్‌కుమార్‌, 72 కిలోల విభాగంలో బి.ఉదయ్‌కిరణ్‌, 77 కిలోల విభాగంలో బి.జీఎస్‌ పట్నాయిక్‌, 82 కిలోల విభాగంలో వి.హరీష, 97 కిలోల విభాగంలో కె.సంజయ్‌వర్మ ఎంపికయ్యారన్నారు. స్త్రీల విభాగంలో 53 కిలోల విభాగంలో బి.సుందర, 55 కిలోల విభాగంలో వి.లావణ్య, 59 కిలోల విభాగంలో నిఖితాకుమారి సింగ్‌, 62 కిలోల విభాగంలో కేపీ ప్రవల్లిక, 65 కిలోల విభాగంలో జి.స్వాతి తదితరులు ఎంపికయినట్టు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్‌: మంత్రి



వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

సాలూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారమే ప్రజా దర్బార్‌ ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశుసంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సాలూరులోని తన నివాసంలో ఆదివారం ఆమె ప్రజాదర్బార్‌ కార్యక్రమం నిర్వహించారు. పాచిపెంట మండలం కొత్తూరు పంచాయతీ కొత్తపొలంవలస, పాతపొలంవలస గ్రామస్థులు వచ్చి తమ గ్రామాలకు రహదారి మంజూరు చేయాలని కోరారు. సాలూరు మండలం కందులపథం పంచాయతీ తీనుసామంతవలస, మర్రివానివలస, గ్రామస్థులు వచ్చి పూర్వం నుంచి శ్మశానవాటికగా ఉన్న స్థలాన్ని కొంతమంది ఆక్రమించారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జీసీసీలో కారుణ్య నియామకాలు చేపట్టాలని ఆయా కుటుంబాలు విజ్ఞప్తి చేశాయి. శ్రీసత్యసాయిధ్యాన మండలి సభ్యులు వచ్చి పట్టణంలో కాలుష్య నివారణం కోసం మొక్కలు నాటేందుకు ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించాలని కోరారు.

కొమరాడలో భారీ వర్షం



కొమరాడలో కురుస్తున్న వర్షం

కొమరాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి, భారీ వర్షం కురిసింది. దీంతో ఈ సీజన్‌లో వరి పంట పండేందుకు ఇబ్బందులు లేవని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



పార్టీలో చేరిన వారితో శివశంకర్‌

జనసేన జెండా ఆవిష్కరణ

● పార్టీలోకి పలువురి చేరిక

సీతానగరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జోగింపేటలో జనసేన పార్టీ జెండా ఆవి ష్కరించారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ ఎంఎస్‌ఎంఈ డీసీ చైర్మన్‌ తమ్మిరెడ్డి శివశంకర్‌ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా బైక్‌ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైసీపీని వీడి జనసేనలోకి వచ్చిన 67 మందికి నియోజకవర్గ పీవోసీ ఆదాడ మోహనరావు అధ్యక్షతన శివశంకర్‌ కండువాలు వేసి ఆహ్వానించారు. జనసేన నాయకులు గేదెల సతీష్‌కుమార్‌, కోట్ల కృష్ణ, మర్రాపు సురేష్‌, పైల సత్యనారాయణ, అల్లు రమేష్‌, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

29న మినీ జాబ్‌మేళా

పాలకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యా భివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పన, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్‌ నాలెడ్జ్‌ సెంటర్‌ విభాగం సంయుక్తం గా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 29న మినీ జాబ్‌ మేళాను నిర్వహించనున్నా రు. ఈ మేరకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ ఎం.శ్యాంబాబు ఆదివా రం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి, ఇంటర్‌, ఐటీఐ, ఏదైనా డిగ్రీ చదువుకుని 18 నుంచి 25 సంవత్సరాలు ఉన్న నిరుద్యోగ యువతి యువకులు ఈనెల 29న ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. http://naipunyam. ap.gov వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. రిఫరెన్స్‌ నెంబర్‌తోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, ఒరిజనల్‌, జిరాక్స్‌, పాస్‌పోర్టుసైజ్‌ ఫోటో ఒకటితో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 70930 28546 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

చురుగ్గా సభ్యత్వ నమోదు

● గిరిజనుల నుంచి వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, వీరేశ్‌

గుమ్మలక్ష్మీ పురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యో తి): మండ లంలోని రాయగడ, జమ్ము గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా సాగింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, టీడీపీ నాయకులు వీరేశ్‌దేవ్‌, కోలా రంజిత్‌, పార్టీ మండల అధ్యక్షుడు పాడి సుదర్శనరావు పాల్గొన్నారు. గిరిజన ప్రజలు పెద్దఎత్తున హాజరై తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు.

ఇదీ ప్రమాద హెచ్చరికే..



గోతిలో కర్ర పాతి ఎర్రగుడ్డ కట్టిన దృశ్యం

వీరఘట్టం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నడిమికెళ్ల గ్రామంలో గల పార్వతీ పురం-వీరఘ ట్టం ప్రధాన రహదారి మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో గ్రామస్థులు అక్కడ ఒక కర్రను పాతి, ఎర్రటి గుడ్డను కట్టారు. కొంత వరకైనా ప్రమాదాలు తగ్గుతాయని ఆశిస్తున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇంటర్వ్యూ

రైతులకు అందుబాటులో సేవలు

● అనురాధ పండా, ఏవో, సాలూరు



సాలూరు రూరల్‌, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికొచ్చే తరుణం ఆసన్నమైందని, ఈ పరిస్థితుల్లో వారికి వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు అవశ్యమని సాలూరు ఏవో అనురాధ పండా అన్నారు.

ప్రశ్న: ఎరువుల లభ్యత ఎలా ఉంది?

ఏవో: రైతులకు ఎరువుల కొరత రాకుండా కార్యాచరణ చేశాం. ఇప్పటికే కావాల్సిన ఎరువులు అందించాం.

ప్రశ్న: ఎరువులు ఒడిశాకు తరలి వెళ్తున్నాయా?

ఏవో: ఏపీ ఎరువులు ఒడిశాకు సాలూరు నుంచి వెళ్లకుండా నిఘా ఉంది. ఎరువులు ఆర్బీకేలకు, పీఏసీఎస్‌లకు ఇండెంట్‌ ప్రకారమే తెప్పించి రైతులకు అందిస్తున్నాం. అవి పక్కదారి పట్టడానికి అవకాశాలు తక్కువ.

ప్రశ్న: విత్తనాలపై పర్యవేక్షణ ఎలా ఉంది?

ఏవో: రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడానికి ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నాం. ఎప్పటికప్పుడు విత్తనాలమ్మే షాపులను తనిఖీ చేశాం.

ప్రశ్న: టార్పాలిన్‌, ట్రాక్టర్‌ పరికరాలు రాయితీపై అందిస్తారా?

ఏవో: టార్పాలిన్‌, ట్రాక్టర్‌ పరికరాలు రాయితీపై కావాలని రైతులు వినతులిచ్చారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.